## కొత్త సైకిల్ - by SKU

Back Home

ఈ మధ్య నేను కొత్తగా సైకిల్ కొనుక్కున్నా. "కారు driving ఎలాగూ మన వల్ల కాదు" అని డిసైడ్ అయిపోయినట్టుంది అని నవ్వుకుంటున్నారు కదూ? అదేం లేదు అది కూడా సాధిస్తా! (సూరమ్మ శపథం!) సరే, సైకిల్ కొనుక్కున్నాను కదూ.. ఆ విషయం మా ఫ్రెండ్స్ కి చెప్తే, ఒకాయన అడిగారు.. "మూడు చక్రాల సైకిలా?" అని బహుశా మన ప్రతిభ మీద శంక తో కాబోలు. మీకు కూడా అలాంటి అనుమానం ఏమన్నా వుంటే, నేను కొనుక్కున్నది రెండు చక్రాల సైకిలే, రోడ్డు మీద నడిపే సైకిలే, పెద్దవాళ్ళు నడిపే సైకిలే. వివరాలు చాలా?!

ఇండియా లో వుండగా ఎప్పుడూ గేర్లు వున్న సైకిల్ నడపలేదు. ఆఖరికి నా స్కూటర్ కి కూడా గేర్లు లేవు.. ఏక్సిలరేటర్ మాత్రమే వుండేది. ఇప్పుడు ఈ సైకిల్ కి 7 x 7 మొత్తం 49 వేరియేషన్స్ వున్నాయి ఆ గేర్లకి! సైకిల్ షాప్ లో అబ్బాయి అదేదో మామూలు విషయం, నాకు తెలిసే వుంటుంది అనే ధోరణి లో అన్నీ చెప్పారు, నాకు నచ్చింది, బిల్లు కూడా కట్టేసాను. అన్నీ అయ్యాక, అడిగాను చల్లగా.. "నాకు గేర్లు వున్న సైకిల్ నడపటం రాదు.. కొంచెం ఈ టెక్నాలజీ ఏమిటో చెప్తారా?".

దానికి ఆ అబ్బాయి కి సౌండ్ కట్! "మరి సైకిల్ ఇంటికి ఎలా తీసుకెళ్తారు?" అని అడిగారు. సైకిల్ షాపు వున్నది మా వీధి లోనే. నాలుగు ట్రాఫిక్ లైట్లూ, మూడు పెద్ద ఇంటర్ సెక్షన్ లూ వున్నాయి. డవున్ టవున్ రోడ్.. కొంచెం రష్ గా వుంటుంది.

"చిన్న చిన్న సందుల్లోంచీ, గొందుల్లోంచీ వెళ్ళిపోతాను." చెప్పాను.

"అలా అయితే, హెల్మెట్ కొనేసేయండి. లేకపోతే మీరు రోడ్ మీద వెళ్ళటం ప్రమాదం" చెప్పారు.

నా బతుకు మీద నాకే విరక్తి వచ్చేసింది ఆ మాట వినగానే. కారు నడపటానికి నేను రోడ్డు కి ప్రమాదం అంటారు.. అదే, రోడ్డు మీద పోయేవాళ్ళకి ప్రమాదం అంటారు, ఆఖరికి సైకిల్ నడపడానికి కూడా నేను తగనా?

రోషం తో చెప్పాను. "నేను ఇండియా లో వుండగా సైకిల్ స్కూటర్ నడిపేదాన్ని. డబుల్స్ కూడా వెళ్ళేదాన్ని ఎప్పుడూ ఏక్సిడెంట్ చెయ్యలేదు" (ఈ ఆఖరి ముక్క మాత్రం అబద్ధం)

"కానీ గేర్లు బండి తో ప్రమాదం. రాంగ్ గేర్ లో వుంటే సైకిల్ మీ కంట్రోల్ లో వుండదు.. దానితో ఇంగారు తో తప్పులు చెయ్యచ్చు." నచ్చచెప్పాలన్నట్టు చెప్పారు.

"సరే, సైడ్ వాక్ మీద నడపచ్చా సైకిల్?" అడిగాను.

నన్ను ఒక వింత జంతువు ని చూసినట్టు చూసాడు నా ఈ ప్రశ్న కి. "వెళ్ళకూడదు. సైక్లిస్ట్ ట్రాక్ వుంటుంది దాని మీద వెళ్ళాలి. అది లేనప్పుడు కార్లు వెళ్ళే రోడ్ మీదే వెళ్ళాలి. కార్లు ఆగినట్టే ట్రాఫిక్ లైట్ దగ్గర ఆగాలి"

ఈ ఆఖరి మాట కి నాకు చర్రున కోపం వచ్చింది. నేను అతనికి ఓ మాదిరి గా కూడా కనిపించలేదు అనుకుంటా. సైకిల్ ని పెడల్ మీద కాళ్ళు పెట్టి నడపాలి.. హేండిల్ బార్ ని రెండు

చేతులతో పట్టుకోవాలి లాంటివి కూడా చెప్తారేమో అని.. "నాకు ఆ విషయం తెల్సు" అన్నాను.

నాకు మా ఇంటికి వెళ్ళటానికి అస్సలు ట్రాఫిక్ వుండని రోడ్ల వెంట ఒక మాప్ గీసి ఇచ్చారు. షాప్ చాలా రద్దీ గా వుంది కానీ, లేకపోతే నాకు మళ్ళీ సైకిల్ కూడా నేర్పి మరీ పంపించేవారు. అతని భయం చూసి, ఇంటికి వెళ్ళాక కాల్ చేస్తాను లే.. "క్షేమంగా ఇంటికి వెళ్ళానని" అన్నాను వేళాకోళం గా.

ఇంటికి వచ్చే దారిలో నేను చూసిన సైక్లిస్ట్ లు అంతా నెత్తి మీద హెల్మెట్, సైకిల్ కి రకరకాల హంగులతో వెళ్తుండటం చూసి, నవ్వు వచ్చింది. ఇండియా లో అయితే, స్కూటర్ నడిపేటప్పుడు హెల్మెట్ పెట్టుకోండయ్యా అంటే ఎవరూ వినట్లేదు అని రూల్ చేస్తే దానికి కూడా ఎవో వంద శంకలు పెడతారు. ఇదంతా హెల్మెట్ తయారు చేసే కంపెనీలతో లాలూచీ అంటూ పత్రికల వాళ్ళు కూపీల వ్యాసాలు రాస్తారు. ఇలా సైకిల్ నడిపే వాళ్ళు కూడా హెల్మెట్ పెట్టుకోవాలి అని అక్కడ కూడా రూల్ చేస్తే?? (అన్నట్టు ఇక్కడ రూల్ ప్రకారం సైకిల్ నడపటానికి అందరూ హెల్మెట్ పెట్టుకోనక్కర్లేదు కానీ, రోడ్ మీద హెల్మెట్ లేకుండా సైక్లింగ్ చేసే వాళ్ళు ఒక్కళ్ళు కూడా నాకు తారసపడలేదు.) వాళ్ళందరినీ చూసిన మీదట, నా సైక్లింగ్ మీద నాకు నమ్మకం వున్నా ఎందుకైనా మంచిది అని రెండో రోజే నేనూ ఒక శిరస్త్రాణం కొన్నాను.

మొత్తానికి ఇంటికి అతను ఇచ్చిన రూట్ లో క్షేమంగా వచ్చాను. ఇంతకీ నాకు అన్ని గేర్లూ వడటం మాత్రం చెప్పలేదు ఆ అబ్బాయి. ఎదో ఒక గేర్, దాని 7 వేరియేషన్స్ చూపించి, "ముందు ఇవి మాస్టర్ చెయ్యి.. తరువాత మిగిలినవి తెలుసుకోవటం అంత కష్టం కాదు" అన్నారు.

* * *

అసలు నేను సైకిల్ కొనటం వెనకాల మా కొలీగ్ ఒకమ్మాయి ప్రోత్సాహం చాలా వుంది. మా అట్టావా నగరం లో మంచి మంచి సైకిల్ ట్రాక్స్ వున్నాయి, వాటి మీద సైకిల్ చేస్తూ వెళ్తే భలే బాగుంటుంది అని తను బోలెడు సార్లు చెప్పిన మీదట ఈ నిర్ణయం చేసాను. అయితే, నేను ముందు అనుకున్నది ఎదో మామూలు రకం సైకిల్ కొందామని. ఎందుకంటే నేను ఏ మాత్రం శ్రద్ధ గా రోజూ సైకిల్ చేస్తానో నాకు తెలుసు. కానీ ఆ సైకిల్ షాప్ లో అబ్బాయి చాలా అమాయకమైన కుర్రాడి లా అనిపించారు. నాకోసం రకరకాల సైకిళ్ళు చూపించారు, వాటి వివరాలు నేను అబ్బుర పోయేట్టు చెప్పారు. ఇండియా లో వుండగా ఎదో హీరో వాళ్ళ ఆడపిల్లల సైకిల్ వాడిన అనుభవం వుంది కానీ ఇలా ఇన్ని హంగులు వున్న సైకిల్ చూడలేదు. అతన్ని చూస్తే భలే ముచ్చట వేసింది. అతను అంత కష్టపడి నాకు అన్నీ చెప్పాక ఏమీ కొనకుండా బయటకి రాబుద్ధి కాలేదు, ఇలా నేను అనుకున్న దాని కన్నా ఎక్కువే పోష్ సైకిల్ కొనేసాను.

నేను సైకిల్ కొన్న మర్నాడు ఆఫీస్ కి పోగానే మా కొలీగ్ కి ఆనందం గా నా సైకిల్ కొన్న విషయం చెప్పాను. మనం వచ్చే వారం నుండి సైక్లింగ్ కి పోవచ్చు అన్న నా మాట కి తను చెప్పింది నిరాశ గా, కుదరదు .. "నిన్న మా లాకర్ లో లాక్ చేసిన సైకిల్ నే ఎవరో ఎత్తుకుపోయారు!" నాకు సౌండ్ కట్!

మీ సూచనలూ, సలహాలూ రచయిత్రి SKU కి తెలియజేయండి.

మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి